క్లుప్తంగా

నేడు వాహనాలకు వేలం

భూపాలపల్లి రూరల్: ప్రొహిబిషన్, ఎక్సైజ్ భూపాలపల్లి స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు నేడు 18న(బుధవారం) 11.30 గంటలకు భూపాలపల్లి ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుస్తుగా ఈఎండీ చెల్లించి పాల్గొనాలని, వాహనాలు కొనుగోలు చేసిన వారు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

20న ప్రజావేదిక

పలిమెల: మండలంలో ఉపాధిహామీ పథకం మూడోవ విడత సామాజిక తనిఖీ ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు జరుగుతున్న నేపథ్యంలో 20న ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రజావేదిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

'పోలీసులను బదిలీ చేయాలనడం సరికాదు'

టేకుమట్ల: జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న పోలీసు సిబ్బందిని బదిలీ చేయాలని కొంత మంది నాయకులు అనడం సరికాదని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. పోలీసులను బదిలీ చేయాలని కొంతమంది ఇతర పార్టీ నాయకులు చేస్తున్న ఆరోణపలు సరికావన్నారు. ప్రజలకు అందుబాటులో లేకుండా, అధికార పార్టీ నాయకులకు అందుబాటులో ఉంటున్న కలెక్టర్‌ను బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పశు వైద్యశాలలో మందుల కొరత

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్యశాలలో మందుల కొరత నెలకొందని పశుపోషకులు, రైతులు మంగళవారం ఆరోపించారు. పలువురు పశుపోషకులు, రైతులు తమ మూగజీవాలకు వైద్యం చేయించుకోవడానికి ఆస్పత్రికి రాగా చికిత్సకు సంబంధించిన మందులు అందుబాటులో లేవన్నారు. పేరుకే ప్రభుత్వ వైద్యశాల ఉందని ఎప్పుడు మందులు అందుబాటులో ఉండవని ఆరోపించారు. పశువులు రోగాల భారిన పడితే ప్రైవేట్‌గా మందులు కొనుక్కోవాల్సి వస్తుందని ఆర్థిక భారం అవుతుందని వారు పేర్కొన్నారు. అధికారులు స్పందించి మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం

రేగొండ: మండలంలోని తిరుమలగిరి గ్రామా నికి చెందిన మూగల అమృతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని జాతీయ మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల ప్రభాకర్ మంగళవారం పరామర్శించి, 50 కిలోల బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పసుల అశోక్, మండల తిరుపతి, పసుల రాకేష్, నవీవ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

మహదేవపూర్: మండల కేంద్రంలో మంగళవారం వారసంత (అంగడి)లో కూరగాయలు అమ్మే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. మండల కేంద్రంలోని వారసంతకు వరంగల్ జిల్లా పరకాలకు చెందిన సమ్మయ్య (45) కూరగాయలు అమ్మనికి వచ్చాడు. సాయంత్రం కుప్పకూలి పోవడంతో స్థానికులు వెంటనే 108 వాహనంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్ చంద్రశేఖర్ పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయం తెలిసిన తొటి వ్యాపారస్తులు కన్నీంటి పర్యంత మైయ్యారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

రేగొండ: ఎన్నికల అనంతరం రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం రేగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల అధ్యక్షులు ఐత ప్రకాశ్‌రెడ్డి, ఇప్పకాయల నర్సయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పాటు పడే కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నో హామీలను ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో హామీలను నెరవేర్చిన దాఖాలాలు లేవని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను నెరవేరుస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం గోరికొత్తపల్లి మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, మాజీ ఉప సర్పంచ్ బండి సాయిలుగౌడ్, గండు మహేందర్ గౌడ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: మాట్లాడుతున్న సత్యనారాయణరావు

ర్యాలీని విజయవంతం చేయాలి

చిట్యాల: జిల్లాలో రేపు(గురువారం) రాహుల్ గాంధీ నిర్వహించే బైక్ ర్యాలీకి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా సత్యనారాయణరావు హాజరై మాట్లాడుతూ.. బైక్ ర్యాలీలో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. బైక్ ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, జిల్లా నాయకులు ముకిరాల మధువంశీకృష్ణ, దొడ్డి కిష్టయ్య, దబ్బెట అనిల్, గడ్డం కొమురయ్య, దబ్బెట రమేష్, మేరుగు లక్ష్మీ, మూల శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీ'లపై ప్రచారం

మహాముత్తారం: ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మహాముత్తారం మండలంలోని కనుకునూర్, సింగంపల్లి, మాదారం గ్రామాల్లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ ఆరు గ్యారంటీలపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ బెల్లంకొండ కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పక్కల సడువలి, యూత్ అధ్యక్షుడు వంశీరాజ్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఏటూరునాగారం డివిజన్‌లోనే కొనసాగించాలి

ఎస్ఎస్ తాడ్వాయి : నూతనంగా ఏర్పడిన ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్‌లోనే తాడ్వాయి మండలాన్ని కొనసాగించాలని తాడ్వాయి మండల జేఏసీ ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏఓ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమ్మక్క–సారలమ్మ తాడ్వాయి మండలాన్ని గెజిట్ 63/23, జీఓ నంబర్ 363 ప్రకారం నూతన రెవెన్యూ డివిజన్‌లో కొనసాగించాలన్నారు. మండలంలోని ప్రజందరూ ఇందుకు నో అబ్జెక్షన్‌తో కూడిన లిఖిత పూర్వక వినతి పత్రాలు కూడా ఇచ్చామన్నారు. అలాగే మండలంలోని 13 గ్రామపంచాయతీలు, పేసా గ్రామసభ నిర్వహించి తీర్మానాలు చేశాయన్నారు. అలాగే ఆదివాసీ విద్యార్థి సంఘం, సమ్మక్క–సారలమ్మ పూజారుల సంఘం కూడా తీర్మానాలు చేసిందన్నారు. జాతర మాజీ చైర్మన్లు నర్సయ్య, శివయ్య ఉన్నారు.

చెక్ పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు



ఆర్టీసీ బస్సును తనిఖీ చేస్తున్న నరేష్, సిబ్బంది



కారును పరిశీలిస్తున్న ఎస్సై నరేష్

మల్హర్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలోని కొయ్యూరు పెట్రోల్ బంకు సమీపంలో కొయ్యూరు పోలీసులు చెక్ పోస్ట్ ఏర్పాటు చేసిన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కాటారం–మంథని వైపు వెళ్తున్న వాహనాలను ఎస్సై వడ్లకొండ నరేష్ ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను విచారించి వదిలేశారు. నరేష్ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50వేల పైచిలుకు నగదుతో ప్రయాణం చేసినట్లయితే తప్పనిసరిగా దానికి సంబంధించిన రసీదులు, ధ్రువీకరణ పత్రాలు ఉంటేనే అనుమతి ఇస్తారని, లేకుంటే నగదును సీజ్ చేయడం జరుగుతుందని వెల్లడించారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

మహదేవపూర్: మండలంలోని కిష్టారావుపేట గ్రామంలోని గుడుంబా స్థావరాలపై ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టారావుపేట గ్రామ శివారులో గుండుంబా తయారు చేసి తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 5 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోని 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఈమేరకు గ్రామానికి చెందిన అనుప వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం అంబట్‌పల్లి గ్రామంలో తనిఖీలు చేయగా వావిలాల లక్ష్మి ఇంట్లో 15 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోని ఆమెపై కేసు నమోదు చేశారు. అలాగే మహదేవపూర్ గ్రామం నుంచి మహారాష్ట్రలోని నడికూడ గ్రామానికి మద్యం అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో అంబట్‌పల్లి గ్రామ శివారులో రూ.28,800 విలువ గల మద్యాన్ని పట్టుకోని సప్పిడి వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సమ్మయ్య హోమ్‌గార్డు స్వామి పాల్గొన్నారు.



మహదేవపూర్: దాడుల్లో పాల్గొన్న పోలీసులు



భూపాలపల్లి రూరల్: అరెస్టు చూపిస్తున్న అధికారులు

కొంపల్లి గ్రామం వద్ద..

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కొంపల్లి గ్రామం వద్ద గుడుంబా రవాణా చేస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఎక్సైజ్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి గ్రామ సమీపంలో వాహనాలు రూట్ వాచ్ చేస్తున్న క్రమంలో రెండు ద్విచక్ర వాహనాల్లో 20 లీటర్ల నాటు సారాయి తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రవాణా చేస్తున్న నిందితుడు గూగులోతు రాజును అదుపులోకి తీసుకున్నామన్నారు. అదే విధంగా రేగొండ మండలంలో సాయంత్రం రూట్‌వాచ్ చేసి ములుగు మండలం రాంనగర్ తండాకు చెందిన బోల శివకుమార్, నాటుసారా రవాణా చేస్తుండగా నాలుగు లీటర్ల గుడుంబాతోపాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై మాన్‌సింగ్, హెడ్ కానిస్టేబుల్ రఘుపతి, కానిస్టేబుళ్లు సర్దార్, బాలకృష్ణ, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

కాటారం: మండలంలోని దంతాలపల్లిలో ఓ ఇంట్లో విక్రయానికి నిల్వ చేసిన గుడుంబాను మంగళవారం ఎస్సై అభినవ్ పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కమలమ్మ అనే మహిళ గుడుంబా విక్రయిస్తుందనే సమాచారం మేరకు దాడులు చేసినట్లు పేర్కొన్నారు. ఇంట్లో నిల్వ ఉన్న 20లీటర్ల గుడుంబా స్వాధీనపర్చుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు ఆమెపై కేసు నమోదు చేసి ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై వివరించారు.

టేకుమట్ల: ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి నుంచి మంగళవారం మద్యాన్ని స్వాధీన పర్చుకున్నట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో సోదాలు నిర్వహిస్తుండగా మండలంలోని గిద్దెముత్తారం గ్రామానికి చెందిన యాంసాని శ్రీధర్ నుంచి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండల కేంద్రం నుంచి మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా రూ.4800 విలువ చేసే మద్యాన్ని గుర్తించి, స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు.

ఆస్పత్రిలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న వైద్యసిబ్బంది

మహాముత్తారం: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యసిబ్బంది బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలు పడుతూ.. ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో మహిళ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నియంత పాలనను అంతమొందించాలి

● ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్ : తెలంగాణ రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని, దాన్ని అంతమొందించాలని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మంగళవారం బండారుపల్లిలో నిర్వహించిన గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాటం కొనసాగిస్తానన్నారు. నీళ్లు, నిధులు, నియమకాల పేరుతో విద్యార్థుల ఆత్మ బలిదానాలతో సాధించిన తెలంగాణలో నిరంకుశ, నియంతపాలన కొనసాగుతుందని అన్నారు. ఉద్యోగ నియమకాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని వివరించారు. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూమి, అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాల వాగ్దాలను నిలుపుకోలేదని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం బండారుపల్లి మాజీ సర్పంచ్ జంజిరా దేవయ్య, సమ్మయ్య గౌడ్‌లతో పాటు మరో 30 మంది కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రవిచందర్, కుక్కల నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు మావురపు తిరుపతిరెడ్డి, రేవంత్‌యాదవ్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీతక్క

అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు



కాటారం: దేవీ శరన్న వరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా మాత మంగళవారం అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏక్కాం కార్యక్రమం కొనసాగుతోంది. 24 గంటల పాటు భక్తులు భజన కొనసాగిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, మద్ది నవీన్, బీరెల్లి అంజయ్య, రవీందర్, మద్ది మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పలిమెల: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు (బుధవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పరామర్శ

ములుగు రూరల్ : మండలంలోని మాన్‌సింగ్ తండాకు చెందిన గుగులోత్ మోతిలాల్ మంగళవారం మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, భారతీయ జనతా పార్టీ నాయకుడు అజ్మీరా ప్రహ్లాద్ పరామర్శించారు. అనంతరం మోతిలాల్ మృతదేహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాగజ్యోతి గెలుపునకు కృషి చేయాలి



ములుగు రూరల్ : గ్రామస్తులతో మాట్లాడుతున్న గోవింద్‌నాయక్



వెంకటాపురం(ఎం) : సమావేశంలో మాట్లాడుతున్న రమణారెడ్డి

ములుగు రూరల్ : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపునకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని గుర్తూర్‌తండా, చంద్రుతండా, ఈశ్రతండా, రామచంద్రాపూర్ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలి

వెంకటాపురం(ఎం) : ములుగు నియోజక వర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని లక్ష్మీదేవిపేటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఓటరుకు వివరించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో పనిచేస్తూ నాగజ్యోతి గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్క రమేష్, గై అశోక్, బుర్ర సమ్మయ్య, పోరిక హర్జి నాయక్, ఎర్రబెల్లి గోపాల్‌రావు, కూరెళ్ల రామాచారి, ఎండి.అల్లిమియా ఉన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతి

ఏటూరునాగారం : తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆదివాసీ అర్ధనారీశ్వరిల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసం ఇందు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఎస్ఓ రాజ్‌కుమార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 50 మంది అర్ధనారీశ్వరులు ఉన్నామని, తమకు సొంత ఇళ్లు లేక అద్దె ఇంట్లో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం రెవెన్యూ గ్రామపరిధి సర్వే నెంబర్ 209లో ప్రభుత్వ భూమిలో ఆదివాసీ అర్ధనారీశ్వరిలకు ఇంటి స్థలాలు కేటాయించి ఆదుకోవాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కల్తీ చిన్నారి, మడప జెస్సి, పాయం జాను, మద్దెల రేణుక, దుగ్గి కృష్ణవేణి, గుమ్మడి లిల్లీ, ఆలేం మహి, పరికిక రియా, మేసి మల్లయ్య, పెద్దబోయిన శ్రీవాణి ఉన్నారు.



ఎస్ఓకు వినతిపత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ఏటూరునాగారం: రామన్నగూడెంలో సర్వే చేస్తున్న వైద్యురాలు సుచరిత



వాజేడు: రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వాజేడు : మండల పరిధిలోని మొరుమూరు కాలనీ గ్రామంలో మంగళవారం వైద్యాధికారి జ్ఞానస ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని, నీరసంగా ఉన్న వారిని గుర్తించి మందులు ఇవ్వడంతో పాటు రక్త నమూనాలను సేకరించారు. గర్భిణులను పరీక్షల నిమిత్తం వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించారు. రక్త పోటు, మధుమేహం ఉన్న వారిని పరీక్షించి మందులు అందజేశారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గ్రామస్తులతో మాట్లాడుతూ.. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమ తెరలు వాడాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే నిల్వ నీటిని కాల్వలు తీసి తొలగించాలని, గోళాలు, డ్రమ్ములపై మూతలు పెట్టుకోవాలని చెప్పారు. ఈ నెల 26వ తేదీ వరకు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కోటిరెడ్డి, వెంకటరమణ, రాజేశ్వరి, కన్యాకుమారి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.



ఏటూరునాగారం: రాంనగర్‌లో వైద్యశిబిరంలో..



వాజేడు: రక్త నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

ఇంటింటా జ్వరం సర్వే

ఏటూరునాగారం : మండలంలోని రామన్నగూడెంలో ఇంటింటా జ్వరం సర్వేను వైద్యాధికారి సుచరిత తన సిబ్బందితో కలిసి చేపట్టారు. మంగళవారం రాంనగర్ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల జ్వరాలు, ఇతర వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వస్తే వెంటనే రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జైల్ బాబు, ఆశ కార్యకర్తలు హేమలత, రాంనగర్ గ్రామ కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యపరీక్షలు



వెంకటాపురం(కె) : మండల పరిధిలోని ఎస్సీ మల్లిగూడెం ఆరోగ్య మహిళా కేంద్రంలో ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 90 మంది మహిళలకు పరీక్షలను నిర్వహించి వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. సేకరించిన రక్త నమూనాలను పరీక్షల నిమిత్తం ములుగు ఏరియా వైద్యశాలకు పంపినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.